ఈనాడు
నాగర్‌కర్నూల్
మంగళవారం అక్టోబరు 15, 2024

కిక్కిరిసి ప్రయాణం

కందనూలు, న్యూస్‌టుడే : దసరా పండుగ సందర్భంగా హైదరాబాద్ నుంచి మండలంలోని వివిధ గ్రామాలకు వచ్చిన ప్రజలు సోమవారం తిరిగి వెళ్లడంతో పట్టణంలోని ప్రయాణ ప్రాంగణం సందడిగా మారింది. ప్రయాణికులు బస్సుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సుల్లో కిక్కిరిసి నిలబడి ప్రయాణించారు. హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం యాదయ్య తెలిపారు.

కల్వకుర్తి, న్యూస్‌టుడే: దసరా పండగకు వారి వారి స్వగ్రామాలకు చేరుకొని తిరిగి హైదరాబాద్‌కు వెళ్లటానికి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సోమవారం రాత్రి 7గంటల తరువాత కల్వకుర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు బస్సుల కోసం పరుగులు పెట్టారు. ఉదయం నుంచి బస్టాండ్‌లో ప్రయాణికులతో కిటకిటలాడింది. బస్సులో సీట్లకోసం మహిళలు సైతం బస్టాండ్‌కు వచ్చే బస్సుల వెంట పరుగులు తీశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులకు అదనంగా బస్సు ఛార్జీలు పెంచటంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. కల్వకుర్తి నుంచి బస్సులో ఒకరికి రూ.140 టికెట్ ధర ఉంది. ప్రత్యేక బస్సులో రూ.210కి అదనంగా రూ.70 పెంచారు. దరసా సందర్భంగా ప్రయాణికులు కోరటంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులకు మాత్రమే రూ.70 అదనంగా పెంచామని, కల్వకుర్తి నుంచి హైదరాబాద్ కు వెల్లటప్పుడే అదనపు ఛార్జీ ఉంటుందని, తిరిగి వచ్చే సమయంలో అదనపు ఛార్జీలు ఎవరికి ఉండవని డీఎం సుభాషిణి తెలిపారు.



ప్రయాణ ప్రాంగణంలో హైదరాబాద్ బస్సు ఎక్కడానికి గుంపులుగా ఉన్న ప్రయాణికులు

ఆర్టీసీకి దసరా పండగ



హైదరాబాద్ బస్సెక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా ఆర్టీసీకి భారీగా రాబడి సమకూరింది. ఈనెల 1వ తేదీ నుంచి 11 వరకు ప్రత్యేక బస్సులు నడిపిన ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్ మంచి ఆదాయం రాబట్టింది. మహబూబ్‌నగర్ రీజియన్‌లోని 10 డిపోల్లో రద్దీకి అనుగుణంగా దసరా పర్వదినానికి వచ్చే ప్రయాణికుల కోసం బస్సులు అందుబాటులో ఉంచి మంచి రాబడిని సాధించింది. ఈనెల 11న ఆర్టీసీకి భారీగా రాబడి వచ్చింది. మొత్తంగా 3.52 లక్షల కిలోమీటర్ల మేర బస్సులు తిప్పిన సంస్థ 103.04 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో 4,60,727 మంది ప్రయాణికుల్ని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చి రూ.2.17 కోట్ల రాబడి సాధించింది. 10న 3.50 లక్షల కి.మీ తిప్పి ఓఆర్ 100.59తో 4,45,159 మంది ప్రయాణికుల్ని చేరవేసి రూ.2.08కోట్లు రాబడి అందుకుంది. 9న 4,31,166 లక్షల మంది ప్రయాణికుల్ని గమ్యస్థానాలకు చేర్చి రూ.1.97 కోట్ల రాబడి సాధించింది.

తిరుగు ప్రయాణంలో..: సొంతూళ్లలో ఉత్సాహంగా పండగ చేసుకున్న ప్రయాణికులు హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తిరుగు ప్రయాణం కావడంతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. నిత్యం వేలాది మంది ప్రయాణికులు తరలి వెళ్తున్నారు. రద్దీకి అనుగుణంగా ఆదివారం నుంచి ఆర్టీసీ రీజియన్ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. సోమవారం మహబూబ్‌నగర్ బస్టాండులో ఏ బస్సు చూసినా కిక్కిరిసిన ప్రయాణికులతో వెళ్తున్నాయి. మరో రెండు రోజులు తిరుగు ప్రయాణం కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్ఎం వి.శ్రీదేవి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. మొత్తం 9 డిపోల నుంచి 210 బస్సులు నడపనున్నట్లు చెప్పారు.

11న పరిస్థితి ఇలా..

డిపో	తిరిగిన కి.మీ(వేలల్లో)	ఓఆర్ (శాతం)	ప్రయాణికులు	రాబడి (రూ.లక్షల్లో)
మహబూబ్‌నగర్	0.55	103.18	60,295	34.21
వనపర్తి	0.47	108.03	66,343	29.94
గద్వాల	0.44	107.45	71,440	27.66
కల్వకుర్తి	0.41	103.81	48,744	24.57
నాగర్‌కర్నూల్	0.35	112.08	59,645	23.16
నారాయణపేట	0.36	96.51	39,217	21.29
అచ్చంపేట	0.33	101.60	36,989	20.10
షాద్‌నగర్	0.31	97.72	38,049	18.01
కొల్లాపూర్	0.28	94.79	32,741	15.77
కోస్గి	0.05	92.78	7,264	2.52

కొత్త ఉపాధ్యాయులకు నేడు కౌన్సెలింగ్



పల్కపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో వ్యాయామం చేస్తున్న విద్యార్థులు

అచ్చంపేట, న్యూస్‌టుడే : ఇటీవల నియామక పత్రాలు అందుకున్న కొత్త ఉపాధ్యాయులకు ఈనెల 15వ తేదీన నేరుగా కౌన్సెలింగ్ నిర్వహించి, పాఠశాలలను కేటాయించేందుకు డీఈవోలు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాల వారీగా ఉపాధ్యాయ ఖాళీలను ప్రకటించి, ఆయా జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. దీనికోసం ఉదయం 9 గంటల వరకు హాజరు కావాలని సమాచారమిచ్చారు. ఇప్పటికే బదిలీ అయి పాత స్థానాల్లో కొనసాగుతున్న వారికి కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరగానే స్థానచలనం లభించనుంది. ఉమ్మడి జిల్లాలో కొత్తగా 951 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరనున్నారు.

తీరనున్న సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత..

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు జులై మొదటి వారంలో పదోన్నతులపై స్కూల్ అసిస్టెంట్లు (సబ్జెక్టు ఉపాధ్యాయులు) వచ్చినా కొరత పూర్తిగా తీరలేదు. ఉమ్మడి జిల్లాలో 260 మంది స్కూల్ అసిస్టెంట్లు కొత్తగా విధుల్లో చేరనున్న నేపథ్యంలో ఖాళీల సమస్య చాలా వరకు తీరనుంది.

16న విధుల్లోకి

భర్తీ కానున్న ఖాళీలు...

జిల్లా	ఎస్ఏ	భాషా పండితులు	పీఈటీ	ఎస్జీటీ	స్పెషల్ ఎడ్యుకేటర్లు
మహబూబ్‌నగర్	35	22	07	144	06
నాగర్‌కర్నూలు	66	13	02	129	–
జోగులాంబ గద్వాల	34	26	08	77	04
నారాయణపేట	70	22	01	154	05
వనపర్తి	55	08	06	52	05

556 మంది ఎస్జీటీలు..

ఎస్జీటీలకు ఎస్ఏలుగా పదోన్నతి కల్పించడంతో ప్రాథమిక పాఠశాలల్లో కొరత ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలో 556 మంది ఎస్జీటీలు కొత్తగా విధుల్లో చేరనున్నారు. దీంతో తొలిమెట్టు కార్యక్రమం సక్రమంగా అమలు కానుంది. విద్యార్థుల సంఖ్య సైతం పెరిగే అవకాశముంది.

ఆటలకు ప్రాధాన్యం...

వ్యాయామ ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. వ్యాయామ విద్య ఎస్ఏలతో పాటు పీఈటీల ఖాళీలను భర్తీ చేయనుండడంతో విద్యార్థులు ఆటల్లో రాణిస్తారు. తెలుగు, ఆంగ్లం, హిందీ ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ కానుండటంతో భాషపై పట్టు సాధిస్తారు.

కలెక్టరేట్‌లో ఏర్పాట్లు...



నాగర్‌కర్నూలు జిల్లాలో 210 ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు కౌన్సెలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలతో పాటు ఒరిజినల్ నియామక పత్రాన్ని తీసుకొని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి.

- డా.గోవిందరాజులు, డీఈవో, నాగర్‌కర్నూలు

రైతేరాజు 6లో..

నిర్వహణ లేక వృథాగా కృష్ణాజలాలు



కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కాల్వల నిర్వహణ లేకపోవడంతో నీళ్లన్నీ వృథాగా పోతున్నాయి. ఉపకాల్వలకు పూర్తిస్థాయిలో సాగునీరు రావడం లేదు. డీ-73లోని ప్రధాన కాల్వనుంచి కొన్ని ఉపకాల్వలకు చివరి వరకు నేటికీ నీళ్లు వెళ్లడం లేదు. రఘుపతిపేట వద్ద దారిపై పైపులతో నిర్మించిన కల్వర్టులో నీళ్లు పట్టక పోవడంతో దారి, కాల్వ కట్టపైనుంచి పారుతూ పొలాల్లోకి చేరుతున్నాయి. కాల్వ తెగిపోతే పొలాలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఉపకాల్వలకు నీటిని నియంత్రించే వ్యవస్థను చేపట్టాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కల్వకుర్తి పట్టణం

వీడని జలం.. సాగుపై తీవ్ర ప్రభావం

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : అధిక వర్షాలు రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. ఎన్నడూ లేని విధంగా వర్షాలు కురుస్తుండటంతో వేరుశనగ, పత్తి పంటపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పది రోజుల క్రితం కురిసిన వర్షాలకు అధిక మంది రైతులు వేరుశనగ విత్తారు. విత్తిన నాటి నుంచి మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురవడంతో భూమి జాలువారి విత్తనం మొలకెత్తని పరిస్థితి నెలకొంది. వర్షాలు తగ్గినా సాగుకు అవకాశం లేకుండా వరి పొలాలను తలపించే విధంగా మారడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



లింగసానిపల్లి సమీపంలో వరిపంటను తలపిస్తున్న వేరుశనగ విత్తిన మెట్ట భూమి

మార్కెట్ యార్డుల్లో సౌకర్యాలు కల్పనే

ఈనాడు, మహబూబ్‌నగర్: వానాకాలం పాలమూరులోని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో సౌకర్యాలు లేక కర్షకులు నానా అవస్థలు పడుతున్నారు. పంట క్రయవిక్రయాలతో ఆదాయం వస్తున్నా.. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా.. యార్డుల్లో సమస్యలు రాజ్యమేలుతూనే ఉన్నాయి. పంట విక్రయించేందుకు ఇక్కడికి వచ్చే రైతులకు అవస్థలు తప్పడంలేదు. ఉమ్మడి జిల్లాలో మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, నారాయణపేట, మక్తల్, కోస్గి, గద్వాల, అలంపూర్, మదనాపురం, పెబ్బేరు, ఆత్మకూరు, వనపర్తి, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేటలో మార్కెట్ యార్డులు ఉన్నాయి. ఈ వానాకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 18.65 లక్షల ఎకరాల సాధారణ సాగు ఉండగా 16.82 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. వరి-7.64 లక్షల ఎకరాలు, పత్తి-6 లక్షలు, కందులు-1.31 లక్షలు, మొక్కజొన్న-81 వేలు, జొన్న- 32 వేలు, వేరుసెనగ-18 వేల ఎకరాల్లో సాగయ్యాయి. మరికొద్ది రోజుల్లో పంటలు చేతికి రానున్నాయి. ప్రస్తుతం మార్కెట్ యార్డులకు మొక్కజొన్న వస్తోంది. ఈ నెలాఖరులో కందులు, వేరుసెనగ, వరి కూడా వచ్చే అవకాశాలున్నాయి. యార్డుల్లో కనీస సదుపాయాల్లేక రైతులు ఇబ్బందులు పడటమేగాక గత రెండు, మూడేళ్లుగా ఇక్కడ పంటలకు సరైన ధర రాక తీవ్రంగా నష్టపోయిన వాళ్లు ఉన్నారు.



మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డులో మొక్కజొన్న ఆరబెడుతున్న రైతు

అంతా ఒక్కటై.. : ఉమ్మడి జిల్లాలో పలు వ్యవసాయ మార్కెట్లలో వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు కుమ్మక్కయ్యి రైతుకు మంచి ధర రాకుండా చేస్తున్నారు. కొన్నిచోట్ల వీరికి అధికారుల నుంచి కూడా మద్దతు ఉండటంతో కర్షకులు తీవ్రంగా నష్టపోతున్నారు. సరైన ధరలు రాక కర్షకులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేసిన ఘటనలున్నాయి. మహబూబ్‌నగర్, గద్వాల, నాగర్‌కర్నూల్, వనపర్తిలోని ప్రధాన మార్కెట్ యార్డులతో పాటు పలుచోట్ల వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు తమను మోసం చేస్తున్నారని తరచూ ఆందోళనలు జరిగాయి. ఎక్కువగా మొక్కజొన్న, కందులు, ధాన్యం విక్రయాల్లో మోసాలు జరుగుతున్నాయి. మార్కెట్ యార్డుల్లో రైతులకు సరైన ధర వచ్చేలా మార్కెటింగ్, రెవెన్యూ, వ్యవసాయశాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా కౌంటర్లు వేసి పర్యవేక్షణ చేపట్టాలి. ఉమ్మడి జిల్లాలో ఏ మార్కెట్ యార్డులోనూ ఇది సక్రమంగా అమలు కావడం లేదు. మరి కొద్ది రోజుల్లో యార్డులకు పెద్ద ఎత్తున పంట ఉత్పత్తులు వచ్చే అవకాశం ఉండటంతో ఇప్పటి నుంచే అధికారులు దృష్టి సారిస్తేనే రైతులకు మేలు జరిగే అవకాశాలున్నాయి. దీనిపై మార్కెటింగ్‌శాఖ మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల ఏడీ బాలమణి 'ఈనాడు'తో మాట్లాడుతూ మార్కెట్ యార్డుల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు రైతులకు మంచి ధర వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ సౌకర్యాలు కల్పించాలి..

- రైతుల కోసం ప్రత్యేకంగా మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి
- విశ్రాంతి కోసం ప్రత్యేక గదులను సిద్ధంగా ఉంచాలి
- ధాన్యం కోసం షెడ్డులను ఏర్పాటు చేయాలి
- రాత్రివేళల్లో ఇబ్బందుల్లేకుండా విద్యుత్తు సౌకర్యం కల్పించాలి
- ధాన్యం వర్షానికి తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలి
- పంటకు మంచి ధర వచ్చేందుకు ఈ-నామ్ వ్యవస్థను అమలు చేయాలి.

జిల్లా	సాధారణ విస్తీర్ణం (ఎకరాల్లో..)	సాగైన విస్తీర్ణం (ఎకరాల్లో)
మహబూబ్‌నగర్	3,34,159	3,25,626
నారాయణపేట	4,27,260	4,22,585
నాగర్‌కర్నూల్	5,26,606	4,08,917
వనపర్తి	2,40,233	2,29,588
గద్వాల	3,37,011	2,95,340

జూరాలకు వరద తాకిడి

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: జూరాల ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల వల్ల ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతోంది. గత రెండు రోజులుగా నిలకడగా కొనసాగిన వరద సోమవారం ఉదయం నుంచి పెరుగుతూ వస్తోంది. దీంతో అధికారులు విద్యుత్తు ఉత్పత్తి కోసం 38,499 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో పాటు ప్రాజెక్టు రెండు గేట్లు తెరిచి 14,128 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం జూరాలకు 58,200 క్యూసెక్కుల నీరు వస్తోంది. కుడి కాలువకు 731 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 1,030 క్యూసెక్కులతో పాటు జూరాల సమాంతర కాలువకు 400 క్యూసెక్కులు, బీమా ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 318.150 మీటర్ల స్థాయిలో 8.909 టీఎంసీల నీటిని నిల్వను రికార్డు చేస్తున్న అధికారులు ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లోలను పర్యవేక్షిస్తున్నారు.

చొరవతోనే సత్వర పరిష్కారం

ప్రజావాణికి 43 ఫిర్యాదులు



వినతి పత్రాలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సీతారామారావు

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : ప్రజావాణికి వచ్చే సమస్యలను పరిష్కరించి జిల్లాకు మంచి పేరు తేవాలని జిల్లా అదనపు కలెక్టర్ సీతారామారావు అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణిపై పండుగ ప్రభావం పడింది. పండుగ నేపథ్యంలో తక్కువగా కేవలం 43 ఫిర్యాదులు మాత్రమే వచ్చాయి. ఇందులో ధరణి, రెవెన్యూకి సంబంధించినవే 34 ఫిర్యాదులు ఉన్నాయి. ఈ సందర్భంగా అధికారులతో సీతారామారావు మాట్లాడారు. ప్రజలు ఎంతో నమ్మకంతో ప్రజావాణికి వస్తుంటారన్నారు. వచ్చే ఫిర్యాదులకు అధికారులు సానుకులంగా స్పందించి సమాధానాలు ఇవ్వాలని సూచించారు. సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. జిల్లా అధికారులు మండలాలపై దృష్టి సారించాలన్నారు. ప్రజావాణి సమావేశంలో జిల్లా అధికారులు అతి తక్కువగా హాజరవగా ఎక్కువగా కింది స్థాయి అధికారులే వచ్చారు. సమావేశంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు ఇచ్చేలా చూడాలి..: డీఎస్సీ 2024 ఫలితాలకు సంబంధించి కొంతమందిని 1:3 పద్ధతిలో అభ్యర్థులను పిలువలేదు. కొన్ని జిల్లాల్లో ప్రక్రియ పూర్తి చేసి నియామక పత్రాలను ఇచ్చారు. 13 జిల్లాల్లో మాత్రం కోర్టు కేసులు ఉన్నాయని ఆపివేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో నియామక ప్రక్రియను చేపట్టాలి. 1:3 పద్ధతిలో అభ్యర్థులను పిలిచి ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ చేపట్టాలి. త్వరగా నియామక పత్రాలు ఇచ్చేలా కృషి చేయండి. కేసుల పేరుతో మాకు అన్యాయం చేయవద్దు.



- డీఎస్సీ స్పెషన్ ఎడ్యూకేషన్ అభ్యర్థులు, నాగర్‌కర్నూల్

ఎస్పీ కార్యాలయానికి 14 ఫిర్యాదులు

కందనూలు, న్యూస్‌టుడే : పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 14 ఫిర్యాదులు నమోదైనట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. భూమి పంచాయతీలు 10, భార్య, భర్తల మధ్య పంచాయతీ 1, ఇతర రకాల ఫిర్యాదులు 03 నమోదైనట్లు సూచించారు. ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

రూ.7 కోట్లతో సీసీ రోడ్డు పనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలో రూ.7 కోట్లతో సీసీ రోడ్డు పనులను చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 23వ వార్డులో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతంలో ఆగిన సీసీ రోడ్డు పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముందుగా మట్టి తీసి వదిలేసిన రహదారులకు ప్రాధాన్యం ఇచ్చి పనులు చేయిస్తున్నామన్నారు. నాగర్‌కర్నూల్ పట్టణ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఇటీవలే తూడుకుర్తిలో 25 ఎకరాల స్థలంలో సమీకృత గురుకుల పాఠశాలకు శంకుస్థాపన చేసుకున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి పట్టుబట్టి సమీకృత గురుకులాన్ని నాగర్‌కర్నూల్‌కు మంజూరు చేయించామన్నారు. ం కౌన్సిలర్లు సునేంద్ర, కావలి శ్రీనివాసులు, పద్మ, నిజాం, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ మనక్‌పై నిర్లక్ష్యం !

ముందుకు రాని ప్రైవేట్ పాఠశాలలు

కందనూలు, న్యూస్‌టుడే : విద్యార్థులను తరగతి గదిలోని చదువులకు మాత్రమే పరిమితం చేయకుండా వారి మేధస్సుకు పదును పెట్టడం కోసం, వారిలో శాస్త్ర పరిజ్ఞానం పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమం చేపడుతోంది. విద్యార్థుల ఆలోచనలు ఉన్నతాధికారులు పరిశీలించి ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి ప్రయోగాలు తయారు చేయడానికి రూ. 10 వేల చొప్పున విద్యార్థుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రయోగాలు ప్రదర్శించాల్సి ఉంటుంది. జాతీయ స్థాయిలో రాణించిన ప్రయోగానికి యాజమాన్య హక్కు కల్పిస్తారు. చిన్నతనంలోనే విద్యార్థులతో చక్కటి ప్రయోగాలు తయారు చేయించడానికి అవకాశం ఉన్నా.. జిల్లాలోని 136 ప్రైవేట్ పాఠశాలల నుంచి ఇప్పటి వరకు ఒక ఆలోచన కూడా నమోదు చేయలేదని జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.



ప్రయోగ ప్రదర్శనలో విద్యార్థిని (పాత చిత్రం)

నేటితో ముగియనున్న గడువు..: జిల్లాలో 156 ప్రైవేట్ పాఠశాలలు, 131 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలున్నాయి. ప్రైవేట్ పాఠశాలల్లో ఆరు నుంచి 10 తరగతి వరకు 43,475 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10 తరగతి వరకు 38,148 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు అంతర్జాలంలో ప్రయోగాలకు సంబంధించిన ఆలోచనలు నమోదు చేస్తున్నా.. ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇన్‌స్పైర్ మనక్‌పై దృష్టి సారించడం లేదు. ఇన్‌స్పైర్ మనక్‌లో భాగంగా ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు ప్రయోగాలు రూపొందించడానికి అవకాశం కల్పించారు. ఒక్కో పాఠశాల నుంచి 5 ప్రాజెక్టులు తయారు చేయవచ్చు. జిల్లాలో ఇప్పటి వరకు 154 పాఠశాలల నుంచి 790 ప్రాజెక్టులకు సంబంధించిన ఆలోచనలు అంతర్జాలంలో నమోదు చేశారు. ఇందులో 134 ప్రభుత్వ పాఠశాలల నుంచి వివరాలు నమోదు చేస్తే 20 ప్రైవేట్ పాఠశాలల నుంచి మాత్రమే అంతర్జాలంలో ఆలోచనలు నమోదు చేశారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అక్టోబర్ 15 వరకు పంపేందుకు సమయం ఉండటంతో ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు ఇన్‌స్పైర్ మనక్‌పై దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అవగాహన కల్పిస్తున్నామని జిల్లా సైన్సు అధికారి రాజశేఖర్ రావు పేర్కొన్నారు.

నమోదైన ప్రయోగాల ఆలోచనలు 790	ఆలోచనలు నమోదు చేసిన ప్రభుత్వ పాఠశాలలు 134	ఆలోచనలు నమోదు చేసిన ప్రైవేట్ పాఠశాలలు 20



ఆరోగ్యం మన చేతిలోనే..!

సంపూర్ణ ఆరోగ్యానికి చేతుల శుభ్రత ఎంతో కీలకం. భోజనం చేసే ముందు, తుమ్మినా, దగ్గినా, రోగికి సపర్యలు చేశాక, ఆటలు ఆడిన అనంతరం చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవడం వల్ల చాలా రకాల వ్యాధులు దరి చేరవని వైద్యులు చెబుతారు. ఈ విషయంపై చాలా మందికి అవగాహన లేదు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించే వారు లేకుండా పోయారు. ఫలితంగా చాలా మంది జబ్బుల బారిన పడుతున్నారు. మంగళవారం ప్రపంచ చేతుల పరిశుభ్రతా దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' కథనం.

మీకు తెలుసా!

- సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవడం వల్ల అతిసారాన్ని 30 శాతం మేర, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు 20 శాతం మేర తగ్గించుకోవచ్చు
- ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మందికి చేతులు శుభ్రం చేసుకునే సౌకర్యం కొరవడిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది
- జాతీయ శాంపిల్ సర్వే ప్రకారం దేశంలోని పౌరుల్లో 26 శాతం మంది మల విసర్జన తరువాత సబ్బుతో చేతులు కడుక్కోవడం లేదు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 80 శాతం పాఠశాలల్లో విద్యార్థులకు సబ్బులు అందుబాటులో ఉంచడం లేదు.

న్యూస్‌టుడే, రాజోలి, కోస్గి : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,227 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 3.20 లక్షల మందికి పైగా విద్యార్థులు అభ్యసిస్తున్నారు. 1,500కి పైగా పాఠశాలల్లో చేతులు కడుక్కోవడానికి వీలైన కుళాయిలు అందుబాటులో లేవు. 1,099 పాఠశాలల్లో మన ఊరు-మన బడి పనుల్లో భాగంగా కుళాయిలను ఏర్పాటు చేశారు. వీటిలో కొన్నింటికి నీటి సరఫరా లేదు. విద్యార్థులు మట్టిలో ఆడుకుని, అపరిశుభ్రత మధ్య మల, మూత్ర విసర్జనకు వెళ్తున్నారు. పాఠశాలల్లో సబ్బుల కొనుగోలుకు నిర్వహణ నిధుల్లో కేటాయింపులు చేస్తున్నా.. భోజనానికి ముందు వాటిని అందుబాటులో ఉంచడం లేదు. ఇలాంటి పరిస్థితి లేకుండా ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా పిల్లలు చేతులు శుభ్రం చేసుకునేలా చూడాలి. సబ్బు తప్పనిసరిగా అందుబాటులో ఉంచడంతో పాటు, శుభ్రం చేసుకోకపోతే కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.



ఇలా చేద్దాం..

- ధారాళంగా వచ్చే కుళాయి నీటితో చేతులు శుభ్రం చేసుకోవాలి.
- తరువాత అర చేతులు, వేళ్ల మధ్య సబ్బు లేదా లోషన్‌తో రుద్దుకోవాలి.
- చేతుల వెనుక వైపునుంచి వేళ్ల మధ్య శుభ్రం చేసుకోవాలి.
- చేతులను ముని వేళ్లతో రుద్దుకోవాలి. బొటన వేళ్లు శుభ్రం చేసుకోవాలి.
- మణికట్టు వద్ద బాగా రుద్దుకొని ధారాళంగా వచ్చే నీటికింద ఉంచాలి.



కలిగే అనర్థాలు

- చేతులు శుభ్రంగా ఉంచుకోకపోతే తొందరగా అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.
- మట్టిలో ఆడుకొని శుభ్రం చేసుకోకపోవడం వల్ల నులి పురుగులు, బద్దె పురుగులు పిల్లల కడుపులో పెరిగే అవకాశం ఉంది. దీని వల్ల రక్త హీనత ఏర్పడుతుంది.
- అపరిశుభ్ర చేతులతో ఆహారం తీసుకోవడం వల్ల అతిసారం, టైఫాయిడ్, పచ్చకామెర్లు, అంటువ్యాధులు, రక్త విరేచనాల బారిన పడే ప్రమాదం కూడా ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



రాజోలి ప్రాథమిక పాఠశాలలు కుళాయిలు లేని నీటి ట్యాంకు..



తల్లిదండ్రులూ మీదే బాధ్యత

తల్లిదండ్రులు రోజూ పిల్లల చేతులు శుభ్రం చేయాలి. పాఠశాల నుంచి వచ్చిన వారికి, ఆటలు ఆడుకుని ఇంటికి వచ్చిన చిన్నారులు చేతులు శుభ్రం చేసుకునేలా చూడాలి. వారికి ఇదో అలవాటుగా మార్చాలి. పెరిగిన గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించాలి. అపరిశుభ్రత వల్ల కలిగే అనర్థాల గురించి వివరించి చెప్పాలి. మల విసర్జన అనంతరం సబ్బుతో శుభ్రంగా చేతులు కడుక్కోవాలి. వ్యర్థాలను తాకినప్పుడు కూడా చేతుల శుభ్రత తప్పనిసరి.

- డా.భరత్, చిన్నపిల్లల వైద్య నిపుణులు, గద్వాల ఆసుపత్రి

పిట్ట కొంచెం.. ఆదాయం ఘనం



షెడ్డులో కముజులు

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను ఎంపిక చేసుకుని వాటిని నిత్యాదాయ మార్గాలుగా మార్చుకోవచ్చని నిరూపిస్తున్నారు వనపర్తి జిల్లా కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన యువ రైతు శివప్రసాద్. డిగ్రీ పూర్తి చేసి వ్యవసాయంలో తండ్రికి సాయం చేస్తూ [illegible] ఉంటున్నారు. ఏటా వ్యవసాయంలో పెట్టుబడి మినహా లాభాలు రావడం లేదు. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్న సమయంలో హైదరాబాద్‌లో కముజుల పెంపకంపై శిక్షణ జరుగుతున్నట్లు తెలిసి అక్కడికి వెళ్లారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నెల రోజుల పాటు కముజు పిల్లల పెంపకం, దాణా, రోగనిరోధక శక్తి పెంపొందించడం వంటి పలు అంశాలపై శిక్షణ పొందారు.

నెలకు నికర ఆదాయం : శిక్షణ అనంతరం శివప్రసాద్ గ్రామంలోనే చిన్న షెడ్డు ఏర్పాటు చేసుకున్నారు. కముజుల కోసం రాజేంద్రనగర్‌లోని శిక్షణ కేంద్రం అధికారులను సంప్రదించారు. మొదటి విడతగా ఒకటి రూ.10 చొప్పున 500 పిల్లలు కొనుగోలు చేశారు. అక్కడి నుంచి వాటిని తీసుకురావడానికి రవాణా ఖర్చు రూ.2,500, దాణాకు రూ.8 వేలు, మందులు, ఇతర ఖర్చులు రూ.1,500 మొత్తం రూ.17 వేలు ఖర్చయ్యాయి. కముజు పిల్లలు జాగ్రత్తగా సంరక్షించడంతో 45 రోజుల్లోనే 250 గ్రాముల బరువు పెరిగాయి. ఒక్కటి రూ.180 చొప్పున విక్రయిస్తున్నారు. ఆర్డర్‌పై కిలో రూ.700 వరకు అమ్ముతున్నారు. ఖర్చులు మినహా 45 రోజులకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు నికర ఆదాయం వస్తోంది.

అదనంగా ప్రోత్సాహిస్తే..: ప్రస్తుతం చిన్న షెడ్‌లో [illegible] పెంచుతున్నారు. ప్రభుత్వం రుణం అందించి ప్రోత్సాహిస్తే 5 వేల పిల్లలు పెంచేలా షెడ్డు నిర్మించి, మరో ఐదుగురికి ఉపాధి కల్పించేందుకు అవకాశం ఉంటుందని, జిల్లాలోని పలు దుకాణాలకు నేరుగా వీటిని తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ప్రోత్సాహం అందిస్తే వ్యాపారంలో మరింతగా రాణిస్తానంటున్నారు.



- శివప్రసాద్, రామకృష్ణాపురం

కందిలో ఎండు తెగుళ్లు.. సస్యరక్షణ చర్యలు



తెగులుతో ఎండిపోయిన మొక్కలు

మానవపాడు, న్యూస్‌టుడే : భారీ వర్షాలకు కంది పంటను ఎండు తెగులు ఆశించింది. [illegible] లేక కొందరు రైతులు పంటను పూర్తిగా తొలగించి, వేరే పంటల సాగు చేస్తున్నారు. ఎండుతెగులుతో పాటు పురుగుల నుంచి కంది పంటను ఎలా కాపాడుకోవాలి, తెగుళ్ల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో జోగులాంబ గద్వాల జిల్లా వ్యవసాయాధికారి సక్రియానాయక్ పలు సూచనలు చేశారు.

నీటి యాజమాన్యం : పూత, కాత సమయాల్లో సరిపడా నీటితడులు అందించాలి. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కూడా కంది పండుతుంది.

ఆకుచుట్టు పురుగు : ఆకులను మట్టలుగా చేసి పత్రహరితాన్ని పీల్చి వేస్తాయి. మొక్క ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. నివారణ చర్యగా ఒక లీటరు నీటిలో 1.6-1 మి.లీ. మోనోక్రోటోఫాస్ కలిపి పిచికారీ చేయాలి.

కాయతొలుచు పురుగు : పూత, కాత సమయాల్లో ఆశిస్తుంది. కాయలకు రంధ్రాలు చేసి లోపల ఉన్న గింజలను తినేస్తుంది. పురుగు ఉద్ధృతి తక్కువగా ఉన్నప్పుడు ఒక లీటరు నీటికి 5 శాతం వేప కషాయం లేదా 5 మి.లీ. వేపనూనె కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉద్ధృతి ఎక్కువగా ఉంటే పూత సమయంలో 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్, కాయ దశలో ఒక లీటరు నీటికి 1.5 ఎంఎల్ లేదా 2 ఎంఎల్ క్వినాల్‌ఫాస్ మందు కలిపి పిచికారీ చేసుకోవాలి.

ఎండుతెగులు : ఈ తెగులు వల్ల ఎదుగుతున్న మొక్కలు ఎండిపోతాయి. ఎండిన మొక్కలను చేను నుంచి తొలగించాలి. దీని వల్ల వేరే మొక్కలకు తెగులు వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చు. నివారణ చర్యగా ఒక లీటరు నీటికి కాపర్ క్లోరైడ్ 3 గ్రాములు కలిపి వేర్లు తడిచే విధంగా మొక్కల చుట్టూ పోయాలి.

కలుపు యాజమాన్యం

ఈ పంటకు కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. విత్తనం వేసిన 2 రోజుల్లోపు లీటరు నీటికి పెండిమిథాలిన్ 5 మి.లీ. కలిపి నేల మొత్తం తడిచేలా పిచికారీ చేయాలి. మొక్కలు ఎదుగుతున్న సమయంలో కలుపు నివారణ చర్యల్లో భాగంగా సాళ్ల మధ్య గుంటుక లేదా గొర్రుతో మొక్కలు నేలను కప్పి వేసే వరకు అంతరకృషి చేయాలి. మొక్కల మధ్య కలుపు ఎక్కువగా ఉంటే లీటరు నీటికి 2 ఎంఎల్ క్వైజలోఫాప్ మందు కలిపి పిచికారీ చేయాలి.

రైతేరాజు

ప్రశ్నలు - సమాధానాలు

? పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?
- నాగేశ్వర్‌రెడ్డి, పుట్టపల్లి

✓ లీటరు నీటిలో ఇమామెక్టిన్ బెంజొయేట్ 0.5 గ్రాములు లేదా స్పైనోశాడ్ 1 మి.లీ లేదా ఇండక్సాకార్బ్ 1 మి.లీ లేదా నొవాల్యురాన్ 0.8 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి.

? వేరుశనగలో వేరుపురుగు నివారణకు తగిన చర్యలు తెలపండి.
- భాస్కర్‌రెడ్డి, ఆత్మకూరు

✓ ముఖ్యంగా మొక్కల్లో 200 గ్రాముల ప్రొఫెనోఫాస్ 40% + ఇమిడాక్లోప్రిడ్ 40% 40 లీటర్ల నీటిలో కలిపి పోయాలి. ఎకరాకు 6 కిలోల థయామిథాక్సామ్ 0.9% + ఫిప్రోనిల్ 0.2% గుళికలను ఇసుకలో కలిపి తేమ ఉన్నప్పుడు చల్లాలి.

? మిరపలో పై ముడత నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?
- వెంకటస్వామి, రామన్‌పాడ్

✓ ఒక ఎకరాకు ప్రొఫెనోఫాస్ 400 మి.లీ లేదా డైఫెన్‌థియూరాన్ 300 గ్రాములు లేదా స్పైనోశాడ్ 75 మి.లీ లేదా ఫిప్రోనిల్ 400 మి.లీ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

– న్యూస్‌టుడే, మదనాపురం



- డాక్టర్ రాజేందర్‌రెడ్డి, కీటక శాస్త్రవేత్త, కేవీకే మదనాపురం



పాతాళగంగ సమీపంలో నిలిచిపోయిన వాహనాలు

వాహనాలతో కిక్కిరిసిన శ్రీశైలం రహదారి

శ్రీశైలం ప్రాజెక్టు(అమ్రాబాద్), న్యూస్‌టుడే : తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి దుర్గామాత నిమజ్జనం కోసం శ్రీశైలం వెళ్తున్న వాహనాలతో నల్లమలలోని ప్రధాన రహదారి కిక్కిరిసింది. నిమజ్జనం కోసం వచ్చిన వాహనాలను వంతెనపై నిలపడంతో శ్రీశైలం వచ్చిపోయే వారికి ఇబ్బందులు ఎదురయ్యాయి. పాతాళగంగ పరిసరాల్లో ట్రాఫిక్‌ను ఈగలపెంట పోలీసులు క్రమబద్ధీకరించారు.

18న అండర్-23 క్రికెట్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-23 రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ కోసం ముందస్తుగా నిర్వహించే ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఆరు జట్లను ఈ నెల 18న పిల్లల మర్రిదారిలోని ఎండీసీఏ మైదానంలో ఎంపికలు చేపడుతున్నట్లు ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ సోమవారం తెలిపారు. పాల్గొనే క్రీడాకారులతో మొత్తం ఆరు జట్లుగా విభజించి వారి మధ్య ఈనెల 21 నుంచి 28 వరకు టోర్నీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభావంతులతో అండర్-23 ఉమ్మడి తుది జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. హెచ్‌సీఏ రాష్ట్రస్థాయి అండర్-23 క్రికెట్ టోర్నీ నవంబర్ 4 నుంచి వరంగల్, సంగారెడ్డి జిల్లాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు తెల్లటి క్రీడా దుస్తులతో హాజరుకావాలని సూచించారు.

మిల్లులో రేషన్‌బియ్యం పట్టివేత



పట్టుబడిన వాహనం వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ నందకిశోర్, పోలీసులు

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే : ఖిల్లాగణపురం శివారులోని నవ్య దివ్య రైస్‌మిల్లులో రేషన్ బియ్యం పట్టుబడాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ నందకిశోర్ తెలిపిన వివరాల మేరకు మహబూబ్‌నగర్‌కు చెందిన పుల్లూరు రాజు, పుల్లూరు వెంకటేశ్ సోమవారం ఉదయం ఓమ్ని వాహనంలో 19 క్వింటాళ్ల రేషన్ బియ్యం తీసుకుని ఖిల్లాగణపురం శివారులోని నవ్య దివ్య రైస్‌మిల్లుకు తరలించి వాహనం నుంచి సంచులు దింపుతుండగా సీసీఎస్ పోలీసులు (ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పోలీసులు) పట్టుకుని వాహనాన్ని సీజ్ చేశారు. నిందితులను ఎస్సై సురేశ్ గౌడ్‌కు అప్పగించారు. సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ నందకిశోర్ చేరుకుని రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించారు. 30 గన్ని బ్యాగులు, 8 ప్లాస్టిక్ సంచుల్లో మొత్తం 19 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటిని వనపర్తిలోని పౌరసరఫరాల శాఖ గోదాముకు తరలించారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని మహబూబ్‌నగర్ వీరన్నపేటలోని రేషన్ షాప్ డీలర్ చంద్రశేఖర్ వద్ద కిలో రూ.15 చొప్పున కొని నవ్య దివ్య రైస్ మిల్లర్‌కు కిలో రూ.20 చొప్పున విక్రయిస్తున్నట్లు నిందితులు తెలిపారు. వారిపై, రైస్ మిల్ నిర్వాహకుడు పాలవాది లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు.

భూ రికార్డులు తారుమారు చేశారంటూ..

ప్రజావాణిలో రైతు ఆత్మహత్యాయత్నం



రైతును అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాజకీయ అండదండలు బలంగా ఉన్న బడా రైతులు ప్రభుత్వం తమకిచ్చిన భూమికి సంబంధించిన రికార్డులు తారుమారు చేసి వారి పేర్లు ఎక్కించుకున్నారని ఆరోపిస్తూ రైతు పరశురాముడు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. సకాలంలో పోలీసులు, సిబ్బంది అడ్డుకుని ఆయనను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్సపొందుతున్నాడు.

బాధిత కుటుంబ సభ్యులు తిమ్మప్ప, కృష్ణల కథనం ప్రకారం.. అయిజ మండలం యాపదిన్నె శివారులోని గుడిదొడ్డి గ్రామానికి చెందిన వడ్డే సవారన్నకు ప్రభుత్వం 1986లో సర్వే నంబర్ 321లో 5 ఎకరాల భూమిని మంజూరు చేసింది. ఆయన మృతిచెందిన తర్వాత వారసత్వంగా ముగ్గురు కుమారులు పరశురాముడు, తిమ్మప్ప, కృష్ణ పేరున ఖాతా మార్పు చేయాలని గత కొన్నేళ్లు నుంచి అయిజ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకుంటున్నా పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఆ మూడు కుటుంబాలు జీవనోపాధి కోసం కడప ప్రాంతానికి వలస వెళ్లారు. తిరిగి గ్రామానికి వచ్చేసరికి వారసత్వంగా కుటుంబానికి సంక్రమించాల్సిన భూమిని గ్రామానికి చెందిన ముగ్గురు బడా నాయకులు కబ్జా చేసి వారి పొలంలో కలిపేసుకున్నారు. ఇదీ అన్యాయమంటూ పలుమార్లు అయిజ తహసీల్దార్ కార్యాలయంలో మా భూమిని సర్వే చేసి హద్దు చూపించాలని దరఖాస్తులు చేసుకున్నా ఫలితం లేకపోయింది. గతంలో ఒక సారి సర్వే అధికారులు వచ్చినా బడా నేతలు బెదిరించడంతో వారు వెళ్లిపోయారు. దీంతో పిల్లాపాపలతో సహా కలెక్టర్‌కు తమ గోడు వినిపించడానికి వచ్చామని వారు వివరించారు. తమ అన్న పరశురాముడు ఆ బాధతోనే ఆత్మహత్యకు యత్నించారని తెలిపారు. అధికారులు తమ భూమిని సర్వే చేసి న్యాయం చేయాలని వేడుకుంటున్నామన్నారు. ఇదిలా ఉండగా బాధిత రైతు గత జులై 1న కూడా ప్రజావాణిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు.

అటవీ శాఖకు వాహనం అందజేత



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న పీసీసీఎఫ్ ఎలుసింగ్ మేరు, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ట్రస్టీ అనిల్‌కుమార్ వి ఏపూర్

మన్ననూరు (అమ్రాబాద్), న్యూస్‌టుడే: పులుల సంరక్షణ, వాటి ఆవాసాల పరిరక్షణకు 'వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్' సంస్థ కట్టుబడి ఉందని ఆ సంస్థ ట్రస్టీ, హైదరాబాద్ కార్యాలయ ఛైర్మన్ అనిల్ కుమార్ వి ఏపూర్ అన్నారు. అమ్రాబాద్ పెద్దపులుల అభయారణ్యానికి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బొలేరో వాహనాన్ని పీసీసీఎఫ్ ఎలుసింగ్ మేరకు అందజేశారు. మన్ననూరులోని పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వన్యప్రాణుల వేటను నియంత్రించేందుకు వాహనం ఉపయోగపడుతుందని చెప్పారు. ఏటీఆర్‌లో పులుల సంరక్షణకు ఫ్లాష్ లైట్లు, మెటల్ డిటెక్టర్లు, జీపీఎస్ సిస్టంలు, ఇతర సామగ్రి అందించామని వివరించారు. ఏటీఆర్ ఎఫ్‌డీ శివాని డోగ్రా, డీఎఫ్‌వో రోహిత్ గోపిడి, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ రాష్ట్ర డైరెక్టర్ ఫరీదా టంపాల్, ఎఫ్‌డీవో రామమూర్తి, ఎఫ్ఆర్వోలు గురుప్రసాద్, మహేందర్, చంద్రశేఖర్, దేవజ, డీఆర్వో రవి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో దొంగల చేతివాటం

28.5 తులాల బంగారం ఆభరణాల చోరీ



బస్సు వద్ద కిక్కిరిసిన ప్రయాణికులు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: దసరా పండగకు వచ్చిన ప్రయాణికుల బ్యాగులను దొంగలు తమ చేతివాటంతో తస్కరించారు. దీంతో ముగ్గురు బాధితులకు చెందిన 28.5 తులాల బంగారం, 60 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ నెల 9 నుంచి దసరా పండగ కోసం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రాకపోకలు సాగించారు. ఇతర ప్రాంతాల నుంచి తమ సొంత గ్రామాలకు వెళ్లడానికి భారీగా ప్రజలు తరలివచ్చారు. దీంతో నాలుగు రోజుల నుంచి ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఇదే అదునుగా దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. దొంగలను నియంత్రణ చేయడానికి పోలీస్ శాఖ 20 మంది ఏఆర్ పోలీస్ సిబ్బందిని నియమించినా దొంగలు తమ తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. బంగారం, ఇతర ఆభరణాలు పోగొట్టుకున్న పలువురు బాధితులు రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించారు.

14 తులాల బంగారం మాయం...: హైదరాబాద్‌లో ఉంటున్న నరేశ్ మిలటరీలో పని చేసి ఉద్యోగ విరమణ చేశాడు. దసరా పండగకి తన సొంతూరుకు వెళ్లడానికి ఈనెల 9న హైదరాబాద్ నుంచి రైలులో మహబూబ్‌నగర్‌కు వచ్చాడు. అక్కడ నుంచి పరిగి వెళ్లడానికి ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చి ఊరేళ్లాడు. ఈనెల 11న తన బ్యాగును చూసుకోగా అందులో 14 తులాల బంగారం, 60 తులాల వెండి కనిపించలేదు. దీంతో ఆయన సోమవారం రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఇజాజొద్దీన్ తెలిపారు.

8 తులాల బంగారం..: నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని చిత్తనూర్‌కు చెందిన సలుగుట్టి సుధారాణి పండగకి మహబూబ్‌నగర్‌కు వచ్చింది. అనంతరం సోమవారం తన ఇంటికి వెళ్లడానికి జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌కు వచ్చింది. సాయంత్రం రాయచూర్ బస్సు ఎక్కింది. అనంతరం తన బ్యాగులో ఉన్న ఆధార్ కార్డు కోసం చూడగా చిన్న పర్సు కనిపించలేదు. వెంటనే బస్సు దిగి చుట్టూ పక్కల వెతికినా ఫలితం లేకుండా పోయింది. అనంతరం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అందులో 8 తులాల బంగారం ఉందని, వాటిని వెతికి ఇవ్వాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఓబుల్‌రెడ్డి తెలిపారు.

మహిళా హోంగార్డు బంగారం చోరీ...: హైదరాబాద్‌లోని చింతలబస్తీలో నివాసం ఉంటున్న మహిళా హోంగార్డు కోస్గీ సువర్ణ సీఎం రేవంత్‌రెడ్డి నివాసం వద్ద విధులు నిర్వర్తిస్తోంది. ఈ నెల 12న పండకి గండీడ్ మండలం కొంరెడ్డిపల్లికి వచ్చింది. అనంతరం సోమవారం తిరిగి ఇంటి నుంచి హైదరాబాద్‌కు వెళ్లడానికి మహబూబ్‌నగర్ బస్టాండ్‌కు వచ్చింది. తన ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్ బస్సు ఎక్కింది. ఆమె చేతిలో ఉన్న బ్యాగు చూసుకుంటే జీప్ తెరిచి ఉంది. వెంటనే ఆ బ్యాగ్‌ను తెరిచి చూడగా అందులో ఉన్న ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు కనిపించకుండా పోయాయి. వెంటనే ఆమె రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఓబుల్‌రెడ్డి తెలిపారు.

వరకట్న వేధింపులతో వివాహిత బలవన్మరణం



శిరీష

బిజినేపల్లి, న్యూస్‌టుడే : వరకట్న వేదింపులు తాళలేక బలవన్మరణానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన బిజినేపల్లి మండలంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. దేవరకద్ర మండలం అజిలాపూర్ గ్రామానికి చెందిన శిరీష (23)ను 2018లో బిజినేపల్లి మండలం సల్కర్‌పేట గ్రామానికి చెందిన తిరుపతయ్యకు ఇచ్చి వివాహం చేశారు. అదనపు కట్నం కోసం భర్త తరచుగా వేధించడంతో పెద్దలు పలుమార్లు నచ్చజెప్పారు. ఈనెల 8న మరోమారు భర్తతోపాటు అత్త సుదర్శనమ్మ వివాహితను వేధించి, దాడికి పాల్పడ్డారు. మనస్తాపంతో శిరీష అదేరోజు పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూల్ జనరల్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. మృతదేహంపై గాయాలు ఉన్నాయని, న్యాయం చేయాలని తండ్రి ఆంజనేయులు బిజినేపల్లి ఠాణాలో ఫిర్యాదు చేశారు. శిరీషకు ఇద్దరు కుమారులు. భర్త తిరుపతయ్య, అత్త సుదర్శనమ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



హరిలాల్

బాలానగర్, న్యూస్‌టుడే: పొలంలో పశువులు మేపుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి ఓ రైతు మృతి చెందినట్లు ఎస్సై తిరుపాజీ తెలిపారు. మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన హరిలాల్(44) సోమవారం ఉదయం పొలంలో విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

రైలు ఢీకొని ఒకరు దుర్మరణం

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని తిరుమలదేవుని గుట్టకు చెందిన బండి రాజు (35) ఆదివారం రాత్రి టీడీగుట్ట రైల్వే గేట్ వద్ద పట్టాలు దాటుతున్న క్రమంలో హంద్రీ ఎక్స్‌ప్రెస్ తగలడంతో కిందపడటంతో తల రోడ్డుకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి చెవులు సరిగ్గా వినపడవని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులోకి దూకి మహిళ ఆత్మహత్య



అలివేలు

అడ్డాకుల, న్యూస్‌టుడే : చెరువులో దూకి మహిళా ఆత్మహత్య చేసుకున్న ఘటన మూసాపేట మండలం పోల్కంపల్లిలో చోటుచేసుకుంది. మూసాపేట ఎస్సై శ్రీనివాసులు కథనం మేరకు... పోల్కంపల్లికి చెందిన సుందరయ్య కుమార్తె అలివేలు(34)ను మహబూబ్‌నగర్ గ్రామీణ మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన విటల్‌తో పన్నెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ సంతానం, కుటుంబ కలహాల కారణంగా 3 నెలల నుంచి అలివేలు తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి నిద్రకు ఉపక్రమించిన ఆమె సోమవారం కనిపించలేదు. స్థానిక రైతులు చెరువులో మహిళా మృతదేహం ఉన్నట్టు సమాచారం ఇవ్వడంతో వెళ్లి చూడగా అలివేలుగా గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	126-00
రిటైల్	148-00
డ్రెస్డ్	215-00
స్కిన్‌లెస్	244-00

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

నాగర్‌కర్నూలు : 7993300530 కల్వకుర్తి : 9908803650
అచ్చంపేట : 8008573927 కొల్లాపూర్ : 8008573869

సమస్య : ఆర్డీవో కార్యాలయం వెనక వైపు ఉన్న మహిళా సంఘం భవనం చుట్టూ ముళ్ల చెట్లు పెరిగాయి. - **ధనుంజయగౌడ్**


మహిళా సంఘం భవనం చుట్టూ ముళ్లచెట్లు

సమాధానం : తొలగించే ఏర్పాటు చేస్తాం.
- **శ్రీనివాసన్, కమిషనర్ కొల్లాపూర్ పురపాలిక**

? : నాగర్‌కర్నూల్ పట్టణంలోని మధురనగర్‌లో కాల్వల నిర్మాణాలు చేపట్టలేదు. మురుగు ఇళ్ల మధ్య నిల్వగా మారుతోంది. రాత్రి సమయంలో దోమల బెడద తీవ్రంగా ఉంది.
- **కృష్ణ, నాగర్‌కర్నూల్**

✓ : కాలనీలో మురుగుకాల్వల నిర్మాణాలు చేపట్టడానికి చర్యలు తీసుకుంటాం.

? : నాగర్‌కర్నూల్ 19 వార్డులోని విద్యుత్తు స్తంభాలకు ఎల్‌ఈడీ వీధి దీపాలు బిగించకపోవడం వలన రాత్రి సమయంలో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- **రాముడు, నాగర్‌కర్నూల్**

✓ : కాలనీలో వీధి దీపాలకు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటాం.

పై రెండు ప్రశ్నలకు పురపాలక సంఘం కమిషనర్ నరేశ్ బాబు సమాధానం ఇచ్చారు.

కొల్లాపూర్ పట్టణం, కందనూలు, న్యూస్‌టుడే

తెరపై ఈనాడు

నాగర్‌కర్నూల్‌లో.. రవి : **దేవర.** రమణ : **వేట్టయన్ ద హంటర్.** రామకృష్ణ : **విశ్వం.** **కల్వకుర్తిలో..** పార్థసారథి : **దేవర.** అశోక్ : **వేట్టయన్ ద హంటర్**

కూరగాయల ధరలు కిలో... రూ.లలో



కందనూలు, న్యూస్‌టుడే : టమాటా 70, వంకాయ 45, బెండ 45, మిరప 90, కాకర 64, బీర 64, క్యాలిఫ్లవర్ 68, క్యాబేజీ 45, క్యారెట్ 64, దొండ 50, ఆలుగడ్డ 44, గోకర 64, దోస 40, ఆనంకాయ 18, చిక్కుడు 68, మునగకాయ 85, బీట్‌రూట్ 50, క్షీర, 44, బీన్స్ 95

మొక్కజొన్న క్వింటా గరిష్ఠ ధర రూ.2,390

అచ్చంపేట : అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం మొక్కజొన్న క్రయవిక్రయాలు నిర్వహించారు. 15 మంది రైతులు 329 క్వింటాళ్ల (658 బస్తాలు) మొక్కజొన్న ధాన్యం తెచ్చారు. క్వింటా గరిష్ఠ ధర రూ.2,390, మాదిరి ధర రూ.2,326, కనిష్ఠ ధర రూ.1,609 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారని మార్కెట్ ఛైర్‌పర్సన్ రజిత, కార్యదర్శి నరసింహులు తెలిపారు.

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు


క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అమ్రాబాద్, న్యూస్‌టుడే : క్రీడల్లో ఉన్నత స్థానాలకు చేరుకున్న వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. దసరా సందర్భంగా మండలంలోని వంగురోనిపల్లెలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు అందజేసి మాట్లాడారు. నల్లమలలోని ప్రతి గ్రామంలోనూ ఎందరో క్రీడాకారులున్నారని చెప్పారు.

బాధిత కుటుంబానికి సాయం

అచ్చంపేట, న్యూస్‌టుడే : మండలంలోని అప్పాయిపల్లికి చెందిన రాముడి మృతితో భార్య, ముగ్గురు పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. రాముడి స్నేహితుడు మార్యం రాములుయాదవ్ రూ.20వేలు కుమార్తె హన్సిక పేరు మీద సుకన్య సమృద్ధి యోజన పత్రాన్ని అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో సీఎం ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డా.అనురాధ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి సోమవారం అందజేశారు.

ఆర్టీసీ టికెట్‌తో ప్రయాణికుల అవస్థలు


అచ్చంపేట బస్టాండ్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : దసరా పండుగకు గ్రామాలకు చేరుకున్న ప్రజలు తిరిగి హైదరాబాద్ వెళ్లాలంటే అవస్థలు తప్పడం లేదు. సాధారణంగా అచ్చంపేట నుంచి హైదరాబాద్‌కు బస్సు టికెట్ ధర రూ.210 కాగా.. పండుగ సందర్భంగా ప్రత్యేక టికెట్ మాత్రం రూ.330కు పెంచారు. కూలీ పనులు చేసుకునే తమపై ఆర్టీసీ అధికారులు అధిక భారం మోపుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు.

బస్సులు లేక తిప్పలు

లింగాల, న్యూస్‌టుడే : మారుమూల గ్రామాల నుంచి మండల కేంద్రానికి వివిధ పనుల కోసం వచ్చే వారికి బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలకు సైతం విద్యార్థులు కిలోమీటర్ల దూరం నుంచి నడిచి వస్తున్నారు. చెన్నంపల్లి, పద్మన్నపల్లి, అప్పాయిపల్లి, జీలుగుపల్లి, రాయవరం నుంచి కాలినడకన వస్తున్నారు. బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

అప్రమత్తతతో సైబర్ నేరాలు దూరం

చారకొండ (వెల్దండ గ్రామీణం), న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై చారకొండలో సోమవారం పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది నాగయ్య, తిరుమలరావు, ఏఎస్ఐ కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధోత్సవం

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : కొల్లాపూర్ పాత బస్టాండ్ సమీపంలోని హజ్రత్ సయ్యద్ సులాని గంధోత్సవం సోమవారం నిర్వహించారు. జామా మసీద్ నుంచి పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించి దర్గాకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో గురువు హసీం సుత్తారి, మసీద్ కమిటీ అధ్యక్షుడు ఖాజాపాషా, పర్వేజ్, మహమూద్ పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా చారకొండ వాసి

చారకొండ (వెల్దండ గ్రామీణం), న్యూస్‌టుడే: ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా చారకొండ మండలం గైరాన్‌తండాకు చెందిన లక్ష్మణ్‌నాయక్ నియమితులయ్యారు. సంఘం వ్యవస్థాపకులు గణేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన ఎల్‌హెచ్‌పీఎస్ సమావేశంలో ఆయనకు నియామక పత్రాన్ని నాయకులు అందజేశారు.

తెగుళ్లతో రైతన్న విలవిల

వరిలో కంకినల్లి, సుడిదోమ వ్యాప్తి


కోడేరు: కంకినల్లి తెగులు సోకిన వరి పంట చూపుతున్న రైతు మల్లేశ్



కోడేరు, కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : వరుసగా వర్షాలు కురుస్తుండటంతో వాతావరణ మార్పులు వచ్చి వరి పంటలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. సెప్టెంబర్, అక్టోబర్‌లో వరుసగా భారీ, ముసురు వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో అధికంగా సాగు అయిన వరి పంటలు తెగుళ్ల బారిన పడుతుండటంతో పెట్టుబడులు వస్తాయా లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది ముసురు వర్షాల వేళ పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు వివరించాల్సిన అవసరముంది.

1.47 లక్షల ఎకరాల్లో సాగు..

నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల పరిధిలో మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం సాగునీరు వస్తుండటంతో రైతులు వరి సాగు అధికంగా చేపట్టారు. ఎల్లూరు, జొన్నలబొగుడ జలాశయం, గుడిపల్లి జలాశయాల నుంచి ప్రధాన, ఉప ఉప, పిల్ల కాల్వలు, 543 చెరువులు, కుంటల పరిధిలో ఈ ఖరీఫ్‌లో 1.47 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఇప్పటికే 40 శాతం పంటలు వరి కంకులతో ఉన్నాయి. రెండు నెలల్లో కనీసం నెలకు పది రోజులు సక్రమంగా ఎండలు కాయ లేదు. భారీ, నిర్విరామ ముసురు వర్షాలతో తెగుళ్ల బారిన పడుతున్నాయి.


కంకులకు నల్లబడుతున్న విత్తనాలు

ఇందులో 50 శాతం కంకినల్లి తెగులు వ్యాపించింది. వరి కంకిలోని కొన్ని వరి విత్తనాలు నల్లబడి పోయాయి. అధికంగా సుడిదోమ వ్యాప్తి చెంది పంటల్లో దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. ఇప్పటికే కాండంతొలిచే పురుగు ఉండటంతో నివారించేందుకు రైతులు రెండు, మూడు సార్లు వివిధ రకాల మందులు పిచికారీ చేశారు. అగ్గి తెగులు వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొద్దిపాటి జాగ్రత్తలతో నష్టనివారణ..

గాలిలో తేమ శాతంతో పాటు వేడి ఉండటంతో వరిలో కంకినల్లి, సుడిదోమ, అగ్గి తెగులు వస్తుంటాయి. రైతులు అప్రమత్తంగా ఉంటూ కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే నష్టం తగ్గించుకోవచ్చు. వరి కంకులు వచ్చిన మడిలో రెండు మీటర్ల దూరంలో వరి గంటలను తొక్కుతు పాయలు (దారి) వలే చేస్తే కొంత గాలి వీచి సుడిదోమ, కంకినల్లి తెగుళ్లను నివారించవచ్చు. 40-50 శాతం పొట్టతో ఉన్న వరి పంటకు కొంత నీరు తగ్గించాలి. వర్షాలు తగ్గిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది సూచనలు పాటించి తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలి. **- చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి, నాగర్‌కర్నూల్**

చిల్లరనుకోకండి.. చిత్తశుద్ధితో తీసుకోండి


తిమ్మాజిపేటలో ఓ దుకాణదారుడికి రూ.పది నాణేలను అందిస్తున్న బ్యాంకు అధికారులు

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : తిమ్మాజిపేటలోని యూనియన్ బ్యాంకు అధికారులు సోమవారం ఇంటింటికీ, దుకాణాలు తిరిగి రూ. పది నాణేలపై ప్రచారం నిర్వహించారు. భారతీయ రిజర్వుబ్యాంకు ద్వారా స్పష్టమైన ఆదేశాలున్నాయని, వాటిని ఇచ్చిపుచ్చుకోవచ్చంటూ గ్రామంలోని దుకాణాలు తిరిగి రూ. పది నాణేలను అందించారు. వాటితో పాటు అటుగా వెళ్తున్న ప్రజలు, టీకొట్లు, బండీలవారికి పది నాణేలు చలామణి చేయాలంటూ వివరించారు. నాణేల బస్తాలతో బ్యాంకు అధికారులు తిరుగుతుండడం ప్రజలు ఆసక్తిగా గమనించి విషయాన్ని ఆరాతీయడం కన్పించింది. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ చందన్‌సాహు, సిబ్బంది వెంకటేశ్, సునీల్, నరేందర్ పాల్గొన్నారు.

విద్యుత్తుశాఖ ఏఈపై చర్యలు తీసుకోవాలి


విద్యుత్తుశాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కందనూలు, న్యూస్‌టుడే : చందుబట్లలో దళితుల ఇళ్లకు విద్యుత్తు కనెక్షన్లు తొలగించడంతో పాటు వారిని కులం పేరుతో అవమానపరిచేలా మాట్లాడిన ఏఈపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని విద్యుత్తుశాఖ కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్తుశాఖ అధికారులు సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా ఉన్నతాధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నాయకులు కొత్తపల్లి కుమార్, పృథ్వీరాజ్, కల్యాణ్, నాగేశ్, బాలనాగులు, రాజు, శేషు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఉమామహేశ్వరంలో పల్లకీసేవ


పల్లకీసేవలో భక్తులు

అచ్చంపేట న్యూటౌన్ : మండలంలోని ఉమామహేశ్వర ప్రధాన క్షేత్రం నుంచి పాప నాశనం వరకు సోమవారం పల్లకీసేవ నిర్వహించారు. ప్రత్యేక పూజలు, కోలాట ప్రదర్శనలు చేపట్టారు. దేవస్థాన ఛైర్మన్ మాధవరెడ్డి, కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్‌రావు, సభ్యులు వినోద్, పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామంలో మార్పు తీసుకొద్దాం : ఎమ్మెల్యే

కందనూలు, న్యూస్‌టుడే : జాతీయ సేవా పథకంలో భాగంగా విద్యార్థులు గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టి మార్పు తీసుకరావాలని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. తూడుకుర్తిలో సోమవారం పాలెం వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. సోమవారం నుంచి ఈనెల 20 వరకు గ్రామంలో ప్రజలకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. కళాశాల అధ్యాపకులు సత్యనారాయణ, డా. పుష్పవతి, సత్యనారాయణ, చరణ్‌తేజ, నాయకులు ఇంద్రసేనారెడ్డి, కోటయ్య, ఖాజాబాబా తదితరులు పాల్గొన్నారు.

దళారుల ప్రమేయాన్ని అరికట్టాలి

కందనూలు, న్యూస్‌టుడే : వరి ధాన్యం కొనుగోలు విషయంలో మార్కెటింగ్‌శాఖ అధికారులు దళారుల ప్రమేయాన్ని అరికట్టాలని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం సాయంత్రం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రైతులు వ్యాపారులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాళ్ల రూ. 500 బోనసు ప్రకటించిందని తెలిపారు. సింగిల్ విండో ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సీఈవో శ్రీనివాసులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.




అమ్రాబాద్: పదరలో సురేశ్ కుటుంబానికి అమ్మవారి ముక్కు పుడకను అందజేస్తున్న నిర్వాహకులు.. లింగాల: పాతమార్కెట్‌లో.. కొల్లాపూర్: వరిదేల కమిటీహాల్ వద్ద చండీయాగం


కొల్లాపూర్: శోభాయాత్రలో..

గంగమ్మ ఒడికి దుర్గమ్మ

అమ్రాబాద్, అచ్చంపేట, లింగాల కొల్లాపూర్ పట్టణం, వెల్దండ (గ్రామీణం), న్యూస్‌టుడే : జిల్లాలో పలు చోట్ల దుర్గామాత నిమజ్జనం కనుల పండువగా జరిగింది. పదర మండల కేంద్రంలో దుర్గామాత ముక్కుపుడకను అచ్చంపేట మండలం నడింపల్లికి చెందిన బూరం సురేష్‌యాదవ్ రూ. 8.10 లక్షలకు సొంతం చేసుకున్నారు. చీరలు రూ. 5.53 లక్షలు పలికాయి. అమ్రాబాద్‌లో అమ్మవారి ముక్కు పుడకను రూ. 1.61 లక్షలకు అమ్రాబాద్‌కు చెందిన చింతపల్లి రాజుగౌడ్ దక్కించుకున్నారు. ఇతర వస్తువులకు రూ. 2.61 లక్షలు వచ్చాయి. ● అచ్చంపేటలోని శ్రీరాంనగర్ కాలనీ యువజన సంఘం ఆధ్వర్యంలో దుర్గామాత చీరల వేలం నిర్వహించగా రూ. 1.50 లక్షలు సమకూరాయి. ● లింగాల, కొల్లాపూర్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ● వెల్దండ మండలంలోని కుప్పగండ్ల గ్రామంలో అమ్మవారి ముక్కుపుడకను రూ. 55,316కు బీఎంసీయూ అధ్యక్షుడు శ్రీనునాయక్ దక్కించుకున్నారు. చీరలు రూ. 2.43 లక్షలు పలికాయి. పోతేపల్లిలో చీరను రూ. 30వేలకు, వెల్దండలో జైశ్రీరామ యూత్ వద్ద రూ. 50 వేలకు దక్కించుకున్నారు.

పెట్రోల్ కొరతతో వాహనదారుల నిరసన


తెలకపల్లిలో ఓ బంక్ దగ్గర పెట్రోల్ కోసం ద్విచక్ర వాహనదారుల నిరీక్షణ

తెలకపల్లి, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో రెండు రోజులుగా పెట్రోల్, డీజిల్ కొరత నెలకొని వినియోగదారులు, వాహనదారులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. వివిధ చోట్ల బంకుల్లో పెట్రోల్, డీజిల్ లభ్యత లేక వాహనదారులు ఇబ్బంది పడ్డారు. సోమవారం రాత్రి వరకు ఈ పరిస్థితి నెలకొంది. బంకుల్లో యజమానుల నిర్లక్ష్యం కొరత ఏర్పడిందని వాహనదారులు ఆరోపించారు. చాలా మంది వాహనదారులు బంకుల్లో నుంచి ఇంటి ముఖం పట్టినట్లు ఓ వాహనదారుడు లక్ష్మణ్ ఆరోపించాడు. అధికారులు పర్యవేక్షణ లోపం మూలంగానే వాహనదారులకు అవస్థలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పెట్రోల్, డీజిల్ కొరత సమస్యను తొలగించి సరైన సేవలు అందించాలని డిమాండ్ చేశారు. దసరా సెలవులు, ఆన్‌లైన్ సేవల్లో సమస్యతో ఇబ్బంది ఏర్పడినట్లు కొందరు బంక్ నిర్వాహకులు చెప్పారు. వినియోగదారులకు మంగళవారం ఉదయం వరకు పెట్రోల్, డీజిల్ సరఫరా సమస్య తీరనుందని వారన్నారు.

నమ్మిన సిద్ధాంతం కోసం ఆర్‌ఎస్‌ఎస్ కృషి


కవాతు చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలకు పూలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

అచ్చంపేట, న్యూస్‌టుడే : నమ్మిన సిద్ధాంతం కోసం అంకిత భావంతో పనిచేయడమే ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల లక్ష్యమని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సహ కార్యవాహ్ బి. చంద్రశేఖర్ అన్నారు. సోమవారం అచ్చంపేటలో కవాతు నిర్వహించగా... మహిళలు మంగళ హారతులు ఇచ్చి పూల వర్షం కురిపించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్‌కు రాజకీయాలతో సంబంధం లేదని, కొందరు తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. పురుషులతో పాటు మహిళలు కూడా రాష్ట్రీయ సేవికా సమితి పేరుతో చురుకైన పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. పుర ఛైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, అంజనీమాత సేవా సమితి, రక్షిత మహిళా సొసైటీ, భ్రమరాంబ, వాసవీ కన్యకాపరమేశ్వరీ, భక్త మార్కండేయ శివాలయం మహిళా కమిటీల సభ్యులు పాల్గొన్నారు.


కల్వకుర్తిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


కల్వకుర్తి: జనసందోహం

కనుల పండువగా సద్దుల బతుకమ్మ


కల్వకుర్తి: వేడుకల్లో యువతులు

కల్వకుర్తి పట్టణం, కల్వకుర్తి, ఊర్కొండ, వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే : కల్వకుర్తి పట్టణంలో పురపాలిక సంఘం ఆధ్వర్యంలో కైలాసం గుట్టవద్ద బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. హనుమాన్ ఆలయం నుంచి గుట్ట వద్దకు చేరుకుని బతుకమ్మ ఆడారు. పుర అధ్యక్షుడు సత్యం, మాజీ అధ్యక్షుడు శ్రీశైలం, పీఏసీఎస్ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఊర్కొండ, వెల్దండ మండలాల్లో మహిళలు బతుకమ్మ ఆడారు.


ఊర్కొండలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ప్రీమియంతో పాటు బోనస్ పెంచాలి


ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న లియాఫీ నాయకులు

కల్వకుర్తి, న్యూస్‌టుడే: ఎల్‌ఐసీ పాలసీల్లో నూతన పాలసీలలో మార్పు తీసుకొచ్చి పాలసీ దారులపై పీమియం డబ్బులు పెంచారే తప్పా, పాలసీ దారులకు బోనస్ పెంచకుండా వదిలేయటంపై లియాఫీ ఆందోళన చేపట్టింది. సోమవారం కల్వకుర్తి ఎల్‌ఐసీ శాఖ కార్యాలయం ముందు కల్వకుర్తి లియాఫీ అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. పాలసీదారులకు న్యాయం జరిగేంతవరకు ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. లియాఫీ నాయకులు శ్రీనివాసులు, అల్వాల్ రెడ్డి, శ్రీనయ్య, వెంకటయ్య, ఖాజా, కృష్ణయ్య, శ్రీనివాసులు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


రాముడు

బిజినేపల్లి, న్యూస్‌టుడే : మంగనూరు గ్రామ శివారులోని కేఎల్ఐ కాలువలో పడి ఆదివారం గల్లంతైన యువకుడి మృతదేహాన్ని రెస్క్యూటీం బృందం సభ్యులు సోమవారం సాయంత్రం వెలికితీశారు. నందివడ్డెమాన్ గ్రామానికి రాముడు ఆదివారం తన ద్విచక్రవాహనంపై గౌరారం గ్రామానికి వెళ్తుండగా మంగనూరు సమీపంలోని కేఎల్ఐ కాలువ వంతెనను ఢీకొని కాలువలో పడిపోయాడు. పోలీసులు రెస్క్యూ టీంతో కలిసి గాలించగా, సోమవారం సాయంత్రం మృతదేహం లభ్యమైంది. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

మహిళపై అత్యాచారం.. కేసు నమోదు

తెలకపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని ఓ గ్రామంలో ఒక మహిళపై ఆదివారం అత్యాచారం సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామ శివారులోని పొలంలో 35 ఏళ్ల మహిళ పనులు చేసుకుంటుండగా అదే గ్రామానికి చెందిన యువకుడు మల్లేశ్ ఆమెను సమీపంలోకి లాక్కెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : మండలంలోని గుమ్మకొండ సమీప దారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఎస్సై నరేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. గొరిట గ్రామానికి చెందిన ఎల్లస్వామి(40) సోమవారం బిజినేపల్లికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. గుర్తించిన చుట్టుపక్కల వారు కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. వారు క్షతగాత్రుడిని జడ్చర్ల ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం

కందనూలు, న్యూస్‌టుడే : పట్టణంలోని ఓ వార్డుకు చెందిన ఓ వివాహిత రెండు రోజుల క్రితం ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇద్దరు పిల్లలను తీసుకొని వెళ్లి పోయింది. కుటుంబసభ్యులు పలు చోట్ల వెదికినా ఆచూకీ దొరకలేదు. బాధితులు సోమవారం పట్టణంలోని ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. అదృశ్యం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి అదృశ్యం కేసు నమోదు

కందనూలు, న్యూస్‌టుడే : పట్టణానికి చెందిన వెంకటేశ్ (64) డ్యాన్సు ప్రోగ్రాం కోసం అక్టోబర్ 7న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లాడు. అప్పటి నుంచి చరవాణి స్విచ్ఛాఫ్ ఉండటం, ఇప్పటికీ తిరిగి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

లభించని వ్యక్తి ఆచూకీ


మామిడిపెంట అడవిలో గాలింపు చర్యల్లో అధికారులు

లింగాల, న్యూస్‌టుడే : మండలంలోని ఎర్రపెంట అడవిలో అదృశ్యమైన నిమ్మల శంకర్ కోసం 18 రోజులుగా వెదికినా ఆచూకీ లభించలేదని ఎస్సై జగన్‌మోహన్ సోమవారం తెలిపారు. చెంచులు, పోలీసులు, అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఎర్రపెంట నుంచి కృష్ణ నది సరిహద్దు సమీపం వరకు ఉన్న గుహల్లో గాలించినా ఫలితం లేదన్నారు. వారం రోజులుగా వర్షం కురుస్తున్నందున ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు చెప్పారు. శంకర్, కృష్ణ సెప్టెంబరు 28న ఎర్రపెంట అడవిలోకి దుంపల కోసం వెళ్లి రాత్రి అక్కడే నిద్రించగా... మరుసటి రోజు ఉదయం శంకర్ అదృశ్యమైన విషయం తెలిసిందే.

ఇసుక అక్రమ రవాణా.. డ్రైవర్‌పై కేసు

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న డ్రైవర్‌పై సోమవారం కేసు నమోదైంది. ఎస్సై గురుస్వామి కథనం ప్రకారం... ఈనెల 13న రాత్రి మండలంలోని తుమ్మన్‌పేట నుంచి కొండారెడ్డిపల్లికి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని ఠాణాకు తరలించారు. కోమటికుంటకు చెందిన డ్రైవర్ వినోద్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మూడు రోజుల జైలు శిక్ష

కల్వకుర్తి పట్టణం : మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ఇస్లావత్ మల్లేష్‌నాయక్‌కు సోమవారం కల్వకుర్తి కోర్టు న్యాయమూర్తి కావ్య మూడు రోజుల జైలుశిక్షతో పాటు రూ. 500లు జరిమానా విధించినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠినంగా శిక్షించడం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు.